

ఆప్తులకు అండగా...



చంద్రబాబు అరెస్టు సమయంలో మనోవేదనతో పలువురు మృతి

ఆ కుటుంబాలకు భరోసా ఇవ్వనున్న నారా భువనేశ్వరి

నేడు, రేపు జిల్లాలో 'నిజం గెలవాలి' యాత్ర

కర్నూలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబును సీఎం జగన్ ప్రభుత్వం అక్రమ అరెస్టు చేసి జైల్లో పెట్టిన సమయంలో తీవ్ర మనస్తాపానికి గురై 15 మంది టీడీపీ కార్యకర్తల గుండె ఆగింది. మృతుల కుటుంబాలకు తోడుగా మేమున్నాం అంటూ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అమ్మలా అండగా నిలిచారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా వారి ఇళ్లకు నేరుగా ఆత్మస్థైర్యం నింపుతున్నారు. గత జనవరి నెలలో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచారు. గురు, శుక్రవారాల్లో పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల్లో నారా భువనేశ్వరి నిజం గెలవాలి పర్యటన సాగనుంది. ఆమె పర్యటనను దిగ్విజయం చేసేందుకు కర్నూలు టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఆలూరు ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ, పత్తికొండ, కోడుమూరు టీడీపీ అభ్యర్థులు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు.

● నేడు పత్తికొండలో పర్యటన

అనంతపురం జిల్లాలో నిజం గెలవాలి పర్యటన ముగించుకుని టీడీపీ అధినేత సతీమణి నారా భువనేశ్వరి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు తుగ్గలి మండలం మీటే తండాలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రమావత్ లక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తారు. 3:55 గంటలకు కడమకుంట్ల గ్రామంలో వడ్డె చిన్న రాముడు, సాయంత్రం 5:55 గంటలకు కృష్ణగిరి మండలం ఎర్రగుడి గ్రామంలో మృతుడు పింజరి సుభాన్, 7:45 గంటలకు ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలం హలిగేరి గ్రామంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబాలను భువనేశ్వరి కలిసి వారిలో ఆత్మస్థైర్యం నింపుతారు. రాత్రి పత్తికొండలో బస చేస్తారు. 8వ తేదీ శుక్రవారం కోడుమూరు నియోజకవర్గంలో మృతి చెందిన గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో మహబూబ్‌బాషా, గూడూరులో షేక్షావలి, బోయ గౌరన్న, కోడుమూరు మండలం ప్యాలకుర్తిలో నాగార్జునగౌడ్ కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

బళ్లారి, రాయచూరు అధికారులను కోరిన కలెక్టర్, ఎస్పీ



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ

కర్నూలు (కలెక్టరేట్), మార్చి 6: రానున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కర్ణాటక నుంచి తగిన సహకారం అందించాలని బళ్లారి, రాయచూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను కర్నూలు కలెక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్‌లు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, రాయచూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంతర్రాష్ట్ర అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాకు తెలంగాణతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు, బళ్లారి జిలాలతో అంతర్రాష్ట్ర సరిహద్దు ఉందని పేర్కొన్నారు. సరిహద్దులో అక్రమంగా మద్యం సరఫరా, నేరప్రవృత్తి కలిగిన వారు, సంఘ విద్రోహ శక్తుల కదలికలపై నిఘా ఉంచడం, ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఉన్న కార్యకలాపాలను నియంత్రించడం వంటి అంశాల్లో పరస్పరం తగిన సహకారం అందించుకోవాలని కోరారు. ఎస్పీ జి. కృష్ణకాంత్ మాట్లాడుతూ రాయచూరు జిల్లాలోని రాయచూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం, బళ్లారి జిల్లాలోని మాన్వి, సిరిగుప్ప, మోకా, కంప్లీ 4 అసెంబ్లీ నియోజకవర్గాలు కర్నూలు జిల్లాలోని ఆలూరు, ఆదోని, మంత్రాలయం, మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు కర్ణాటక రాష్ట్రంతో 114 కిలోమీటర్ల మేర సరిహద్దును పంచుకుంటున్నాయన్నారు. మాధవరం, కోసిగి పోలీస్‌స్టేషన్లు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లాకు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్లు, ఇస్వీ, హొళగుంద, హాలహర్వి పోలీస్‌స్టేషన్లు బళ్లారి జిల్లాకు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్లు అన్నారు. అదేవిధంగా కౌతాళం పోలీస్‌స్టేషన్ కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు, బళ్లారి జిల్లాలతో సరిహద్దుకు అతి దగ్గరలో ఉంటుందన్నారు. దీంతో కర్ణాటక పోలీసులు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



పూల సోయగం

పుష్ప పల్లకిపై విహరించినశివ పార్వతులు

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

నేడు గజ వాహన సేవ



శ్రీశైలం, మార్చి 6: వివిధ సుగంధ పరిమళాలను వెదజల్లే పుష్ప పల్లకిపై ఆదిదంపతులు శివపార్వతులు విహరించారు. పుష్ప పల్లకిపై భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల సోయగాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలం క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవాహ్నిక దీక్షతో 11 రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు ఆరో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలను చేశారు. చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించారు. అనంతరం లోక కల్యాణార్థం జపాలు, పారాయణాలు, మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, చండీ హోమం, రుద్రహోమం తదితర కైంకర్యాలను ఆగమశాస్త్రం ప్రకారం జరిపించారు.



పుష్ప పల్లకిపై దర్శనమిస్తున్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

పుష్పప్రియుడు మల్లన్న దేవేరి భ్రామరీతో కలసి పూలపల్లకిపై విహరిస్తున్న అపురూప దృశ్యాలను వీక్షించేందుకు వేలాదిగా భక్తులు శ్రీశైలానికి తరలివచ్చారు. బుధవారం రాత్రి గ్రామోత్సవానికి ముందు ఉభయ దేవాలయ అక్కమహా దేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు.



అనంతరం ముస్తాబైన ఆదిదంపతుల ఉత్సవ విగ్రహాలను రాజగోపురం నుంచి ఆలయ వెలుపలకు తోడ్కొనివచ్చి పుష్పపల్లకిపై కొలువుదీర్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పల్లకి ఉత్సవం ఆలయ ముందుభాగం గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు సాగింది. ఈ వేడుకల్లో నంద్యాల ఎస్పీ రఘువీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గజవాహనసేవ: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి గజవాహనసేవ నిర్వహించనున్నారు.

చంద్రబాబును కలిసిన వీరభద్రగౌడ్

● ఆలూరు టీడీపీ టికెట్‌పై స్పష్టత వచ్చినట్లేనా? ● వైకుంఠం మల్లికార్జున, జ్యోతి తీవ్ర ప్రయత్నాలు



చంద్రబాబును సత్కరిస్తున్న వీరభద్రగౌడ్

కర్నూలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గం టీడీపీ మాజీ ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్, ఆయన తనయుడు బి. గిరిమల్లేశ్‌గౌడ్ బుధవారం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని స్వగృహంలో కలిశారు. రెండు, మూడు రోజుల్లో టీడీపీ అభ్యర్థుల రెండో జాబితా రానున్న తరుణంలో చంద్రబాబును వీరభద్రగౌడ్ కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఆలూరు టీడీపీ టికెట్‌పై గౌడ్‌కు అధినేత చంద్రబాబు స్పష్టత ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. ఆలూరు టికెట్ రేసులో ప్రస్తుతం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, మాజీ ఇన్‌చార్జిలు బి.వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతి మొదటి నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి వారు టికెట్‌పై ఆశలు పెంచుకున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కోట్ల సుజాతమ్మ ఐదేళ్లు పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. రానున్న ఎన్నికల్లో ఆమెకే టికెట్ అని అందరూ భావించారు. అయితే కుటుంబానికి ఒకే టికెట్ అంటూ అధిష్ఠానం కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో డోన్ నియోజకవర్గంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఢీకొట్టడం కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేల్లో వెల్లడైనట్లు సమాచారం. అందుకే తొలి జాబితాలోనే డోన్ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని అధినేత చంద్రబాబు ప్రకటించారు. దీంతో సుజాతమ్మ అభ్యర్థిత్వం ప్రశ్నార్థకంగా మారినా.. మరో అవకాశం ఇవ్వాలని సుజాతమ్మ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కోట్ల కుటుంబం ఆలూరు నుంచి పోటీ చేసే అవకాశాలు సన్నగిల్లడంతో ఆశావహులైన వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జున, జ్యోతి తమకు పరిచయం ఉన్న రాష్ట్ర నాయకుల ద్వారా చక్రం తిప్పారు. తాజాగా వైసీపీకి రాజీనామా చేసి జయహో బీసీ సభలో చంద్రబాబు సమక్షంలో గుమ్మనూరు జయరాం టీడీపీలో చేరారు. ఆయన కూడా ఆలూరు నుంచి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. ఈ నేపథ్యంలో వీరభద్రగౌడ్, ఆయన కుమారుడు గిరి మల్లేశ్‌గౌడ్‌తో కలసి చంద్రబాబును కలవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. టికెట్‌పై స్పష్టత ఇచ్చారనే ప్రచారం హాట్‌టాపిక్‌గా మారింది. 2014లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వీరభద్రగౌడ్ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2019లో కూడా టికెట్ తనకే వస్తుందని ధీమాగా ఉన్నా.. చివరి క్షణంలో కోట్ల కుటుంబం కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరడంతో ఆలూరు టికెట్ సుజాతమ్మకు కేటాయించిన విషయం తెలిసిందే.

ప్రాణం తీసిన కునుకు..!



బాలాకిరణ్, కావ్యశ్రీ (ఫైల్)

● నవ దంపతులను కబళించిన రోడ్డు ప్రమాదం

● వరుడి తల్లిదండ్రులు, డ్రైవరు సహా దుర్మరణం

● 40వ జాతీయ రహదారిపై ప్రమాదం ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

● తిరుమల నుంచి వస్తుండగా ఘటన

● మృతుల్లో నలుగురు సికింద్రాబాదుకు చెందిన వారుగా గుర్తింపు





సంఘటనా స్థలంలో మృతదేహాలు



మృతులు రవీందర్, లక్ష్మి (ఫైల్)



డ్రైవర్ అశోక్ (ఫైల్)

ఆళ్లగడ్డ, మార్చి 6: సాఫీగా సాగుతున్న ప్రయాణంలో ఒక్క క్షణం కునుకుపాటు ఐదుప్రాణాలను బలిగొంది. అందులో వివాహం జరిగి వారం రోజులు కూడా పూర్తి కాని ఓ జంట ఉండటం విచారకరం. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ 40వ జాతీయ రహదారిపై నల్లగట్ల గ్రామం వద్ద బుధవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నవ దంపతులు బాలకిరణ్ (30), కావ్యశ్రీ(28), వరుడి తల్లిదండ్రులు రవీందర్(55), లక్ష్మి(49), డ్రైవరు అశోక్(23)తో కలిపి ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. వీరంతా తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాదు ఈస్ట్ వెంకటాపురానికి చెందిన వారు కాగా డ్రైవరు అశోక్ మాత్రం నాగర్‌కర్నూలుకు చెందిన వాడిగా గుర్తించారు. సికింద్రాబాదు ఈస్ట్ వెంకటాపురం గ్రామానికి చెందిన మంత్రి రవీందర్, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు బాలకిరణ్‌కు గత నెల ఫిబ్రవరి 29వ తేదీన తెనాలికి చెందిన గోవర్ధనరావు, నాగ వరలక్ష్మి దంపతుల పెద్ద కూతురు కావ్యశ్రీతో వివాహం జరిగింది. మొక్కుబడి తీర్చుకోవడానికి తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనార్థం మంగళవారం తెనాలి నుంచి తిరుపతికి వెళ్లారు. అక్కడ వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని కారులో అదే రోజు రాత్రి 11.30 గంటలకు సికింద్రాబాద్‌కు బయలుదేరారు. వీరి వాహనం తెల్లవారుజామున 5.30 గంటలకు ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామం వద్దకు రాగానే అక్కడ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో కారులోని నవ దంపతులు బాలకిరణ్, కావ్యశ్రీ, వరుడి తల్లిదండ్రులు రవీందర్, లక్ష్మి, డ్రైవరు అశోక్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్ఐ నరసింహులు, పోలీసు సిబ్బంది, హైవే సిబ్బంది చేరుకొని జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం పూర్తవగానే మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కాగా డ్రైవర్ అశోక్ కునుకుపాటే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. రవీందర్ కుమారుడు ఉదయ్ కిరణ్ ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మిన్నంటిన రోదనలు

బాలకిరణ్, కావ్యశ్రీల వివాహం జరిగి పసుపు పారాణి ఆరక ముందే ప్రమాదానికి గురవటంతో బంధువుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. అమ్మాయి తల్లిదండ్రుల రోదనలు ప్రభుత్వ వైద్యశాలలో కంట తడిపెట్టించాయి.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 6: జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ బుధవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలులో పనిచేస్తున్న వాహబ్‌ను నందవరం మండలానికి, కౌతాళం డీటీ రామేశ్వరరెడ్డిని ఆదోనికి, పెద్దకడుబూరు డీటీ వీరేంద్రగౌడును కౌతాళం మండలానికి బదిలీ చేశారు. అదేవిధంగా మంత్రాలయంలో పనిచేస్తున్న శేఖర్‌రావును కోసిగికి, తుగ్గలి డీటీ నిజాముద్దీన్‌ను హొళగుందకు, కోసిగి డీటీ రుద్రగౌడును ఆదోనికి బదిలీ చేయగా హొళగుంద డీటీ దీపను పెద్దకడుబూరుకు బదిలీ చేశారు.

ఈసారి శివయ్య నిశ్చితార్థం ఎక్కడ?

ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోని మండపం



నిశ్చితార్థ మండపం కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా ఇక్కడ మహానందీశ్వరుడికి, కామేశ్వరి అమ్మవారికి కల్యాణం జరిపించడం ఆన వాయితీగా వస్తోంది. కల్యాణంలో భాగంగా ప్రధాన ఆలయానికి దక్షిణ భాగంలోని రెండో ప్రాకారం పక్కన ఉన్న మండపంలో స్వామి, అమ్మ వార్లకు నిశ్చితార్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆలయంలోని ఉత్సవమూ ర్తులను ఇక్కడకు తీసుకువచ్చి తతంగం పూర్తయిన తర్వాత ప్రధాన ఆల యంలో కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని జరిపిస్తారు. ఈ కార్యక్రమాని కి అమ్మవారి తరపున శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామానికి చెం దిన గంగవరపు వంశస్థులు, స్వామివారి తరపున దొర్నిపాడు మండలం గుండుపాపుల గ్రామానికి ముక్కామల్ల వంశస్థులు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. ఈ సంప్రదాయం ఆలయం కట్టినప్పటి నుంచి వస్తోంది. ఇంతటి చరిత్ర ఉన్న మంటపాన్ని దేవస్థాన అభివృద్ధిలో భాగంగా గతేడాది సెప్టెంబరులో అధికారులు కూల్చేశారు. దీనిని పునర్నిర్మించేం దుకు మొదట రూ.10 లక్షలు అవుతాయని దేవస్థాన అధికారులు అంచనా వేశారు. ఈ ఖర్చును భరించేందుకు స్వామి, అమ్మవార్ల పెళ్లి పెద్దలు ముందుకు వచ్చారు. ఆ తర్వాత రూ.25 లక్షలు ఖర్చు అవుతాయని దేవస్థాన అధికారులు చెప్పడంతో దాతలు వెనుకడుగు వేశారు. ఆ తర్వాత ఈ మండ పం గురించి అధికారులు అసలు పట్టించుకోవడం మానేశారు. శివరాత్రి పర్వదినం సమీపించాక, మండపం నిర్మాణం చేపడుతున్నా మంటూ కొద్ది రోజుల కిందట పూజా కార్యక్రమాలు నిర్వహించి మమ అనిపించారు గానీ నిర్మాణాన్ని కనీసం మొదలుపెట్టలేదు. ఇక ఈ ఏడాది నిశ్చితార్థ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆ మంటపం స్థానంలో అధి కారులు షామియానా వేశారు. నిర్మించడం చేతగాని అధికారులు అసలు ఎందుకు మంటపాన్ని కూల్చివేశారని భక్తులు ఆగ్రహావేశాలు వెళ్లగక్కు తున్నారు. భూదేవయ్య సత్రాన్ని కూడా గతేడాది మే 29 అర్ధరాత్రి వేళ కూలగొట్టారు. వీరశైవ సంఘం ప్రతినిధులు దేవస్థాన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయగా కొత్త సత్రం నిర్మించుకునేం దుకు ఆలయ పరిసర ప్రాంతంలోనే స్థలం చూపిస్తా మని వారికి హామీ ఇచ్చారు. ఇక ఇప్పటి వరకు అధికారులు ఆ విషయం కనీసం పట్టించుకోలేదు.



నిశ్చితార్థ మండపం స్థానంలో వేసిన షామియానా

యువతను ముంచిన జగన్

కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

డోన్, మార్చి 6: సీఎం జగన్ పచ్చి అబద్ధాలతో నిరుద్యోగ యువతను నిలువునా ముంచేశాడని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో టీడీపీ యువ నాయకులు మర్రి మణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమానికి కోట్లతో పాటు ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్, టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి హాజరయ్యారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మెగా డీఎస్సీ విడుదల చేస్తానని చెప్పి యువతను వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా.. ఉన్న పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును వైసీపీ ప్రభుత్వం అంధకారం చేశారని అన్నారు. యువతకు జాబ్ రావాలంటే మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిని కావాల్సిందేనని ఆయన అన్నారు. డోన్ నియోజకవర్గ ప్రాంతానికి కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రకటించారు. భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో పేద విద్యార్థులు చదువుకునేందుకు విదేశీ విద్యను అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం ఆ పథకానికి తూట్లు పొడిచిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, ఆలంకొండ నబీసాహెబ్, ఎస్ఎండీ రఫీ, విజయకుమార్ రెడ్డి, ఓంప్రకాష్, టీఈ రాఘవేంద్రగౌడు పాల్గొన్నారు.

బీసీల డిక్లరేషన్ చారిత్రాత్మకం: మల్లెల



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మార్చి 6: టీడీపీ ప్రకటించిన డిక్లరేషన్ చారిత్రాత్మకమని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం హుశేనాపురం గ్రామంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పది అంశాలతో బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేయడం శుభ పరిణామమని అన్నారు. సమాజంలో బీసీలకు ఉన్నతమైన గౌరవం తీసుకు రావడానికి ప్రత్యేక రక్షణ చట్టం తీసుకు రానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, నాయకులు వడ్డె నారాయణ, నాగరాజు, కాటినేని నారాయణ, బజారు, కేవీ మధు, జయకృష్ణ, అన్వర్‌బాషా, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఎండు మిర్చి ధర పతనం

● క్వింటానికి రూ. 5వేలకు పైగా తగ్గుదల

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 6: ఎండుమిర్చి ధర పడిపోతోంది. గత వారంతో పోల్చితే అన్ని రకాల ఎండు మిర్చి ధరలు తగ్గాయి. క్వింటానికి ఎండు మిర్చి రూ.5వేలకు పైగా ధర తగ్గింది. దీంతో మిర్చిసాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధర క్వింటం గరిష్టంగా రూ.16,011 పలికింది. ధరలు పతనం కావడంతో రైతులు పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాడిగి రకం మిర్చి కనిష్ఠ ధర రూ.5,009, గరిష్ఠ ధర రూ.16,119 కడ్డీ బ్యాడిగి రకం కనిష్ఠ ధర రూ.4,619, గరిష్ఠ ధర రూ.14,619, సిన్జెంటా రకం కనిష్ఠ ధర రూ.5,100, గరిష్ఠ ధర రూ.13,119 పలికాయి. 2043 రకం మిర్చి కనిష్ఠ ధర రూ.4.269, గరిష్ఠ ధర రూ.14.219, తేజ రకం కనిష్ఠ ధర రూ.5,000, గరిష్ఠ ధర రూ.12,009 పలికాయి. ఎగుమతులు లేకపోవడంతోనే ధరలు పడిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

అవుకు, మార్చి 6: అవుకు బస్టాండ్ సర్కిల్‌లో ఈనెల 4న పట్టపగలు జరిగిన కుమారి అనే మహిళను హత్య చేసిన ఆమె భర్త పోలక రంగస్వామిని అరెస్టు చేసినట్లు బనగానపల్లె సీఐ సుబ్బారావు బుధవారం తెలిపారు. అవుకు పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ రంగస్వామి తాగుడుకు బానిసై భార్య కుమారిపై అనుమానం పెంచుకొని హత్య చేశారన్నారు. అడ్డువచ్చిన కుమారి పిన్ని సుబ్బలక్ష్మమ్మను తీవ్రంగా గాయపరిచారని అన్నారు. ప్రస్తుతం ఆమె కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అవుకు సమీపంలోని జమ్ములమ్మ గుడి వద్ద నిందితుడు రంగస్వామిని అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

ఓర్వకల్లు, మార్చి 6: మండలంలోని గుట్టపాడు గ్రామ సమీపాన నూతనంగా నిర్మిస్తున్న జయరాజ్ ఇస్పాత్ (ఉక్కు పరిశ్రమ) ప్రహరీ పక్కన మంగళవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి తడికెల షెడ్లు కాలిపోయాయి. దాదాపు 10 తడికెల షెడ్లు అగ్నికి ఆహుతయ్యాయి. అందులో బీహార్, ఒరిస్సా, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉక్కు పరిశ్రమలో పని చేస్తూ ఆ షెడ్లలో నివసిస్తున్నారు. సిలిండర్ పేలిన సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షెడ్డులో ఉన్న నిత్యావసర వస్తువులు, కటింగ్ మిషన్లు, పరికరాలు కాలిబూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.5 లక్షల పైగా నష్టం వాటిల్లింది. రెండు ఫైరింజన్లు వచ్చి మంటలను ఆర్పేశాయి.

ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే దళితులపై దాడులు

● సాయి ప్రసాద్‌రెడ్డిపై ప్రజా సంఘాల ఆరోపణ ● మాదిగ జయమ్మకు మద్దతుగా ఆందోళన



బాధిత మహిళను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, టీడీపీ నాయకుడు భూపాల్ చౌదరి



ఆదోని రూరల్, మార్చి 6 : ఆదోనిలో దళితులు, దళిత మహిళలపై దాడులు పెరిగాయని, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వీటిని ప్రోత్సహిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు, జనసేన నాయకులు ఆరోపించారు. ఆదోనిలోని కల్లుబావికి చెందిన వైసీపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి పురుషోత్తంరెడ్డి గత సోమవారం రాత్రి మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన మాదిగ జయమ్మను కులం పేరుతో దూషిస్తూ కొంగుపట్టి లాగి ఇనుప రాడ్‌తో తలపై కొట్టాడు. అడ్డొచ్చిన ఆమె కుమారులపై కూడ చెయ్యి చేసుకున్నాడు. ఈ ఘటనపై ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. దీంతో బీఎస్పీ నాయకులు శాంతరాజ్, సీపీఐ ఎంఎల్ నాయకులు మల్లికార్జున, జనసేన నాయకుడు పులిరాజాతోపాటు దళిత, ప్రజాసంఘాల నాయకులు బాధిత మహిళను పరామర్శించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదోని నియోజకవర్గంలో రోజు రోజుకూ దళితులపై, దళిత మహిళలపై దాడులు పెరిగాయని, వైసీపీ నాయకులు యథేచ్ఛగా దళితులపై దాడులు చేస్తున్నా... స్థానిక ఎమ్మెల్యే ఎందుకు నోరు తెరవడం లేదని విమర్శించారు. పైగా దళితులపై దాడులను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని, నాగనాథనహళ్లి ఘటనకు ఎమ్మెల్యే కారణమని అన్నారు. ఈ దాడికి ప్రధాన కారణమైన వైసీపీ నాయకుడు పురుషోత్తంరెడ్డిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాగా పురుషోత్తంరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసుతోపాటు 320, 324, 354, రెడ్‌విత్ 34, సెక్షన్3(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు. అలాగే గుండమ్మ, కిషోర్, చిన్న ఈరమ్మలపై కూడ కేసు నమోదు చేశామన్నారు.

టీడీపీ నాయకుడు భూపాల్ చౌదరి పరామర్శ :

వైసీపీ నాయకుడు పురుషోత్తంరెడ్డి దాడిలో గాయపడి ఆదోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మాదిగ జయమ్మను కర్నూలు టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, జయరాం, లక్ష్మీనారాయణ, బుద్ధారెడ్డి పరామర్శించి అండగా ఉంటామన్నారు.

తేజ అపార్ట్‌మెంట్‌లో చోరీ

10 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు అపహరణ

నంద్యాల క్రైం, మార్చి 6: నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్బీఐ కాలనీలో గల తేజ అపార్ట్‌మెంట్‌లో ఓ దొంగ రూ.5 లక్షల నగదు, 10 తులాల బంగారం చోరీ చేశాడు. అపార్ట్‌మెంట్‌లోని 301 నెంబరు గల ఫ్లాట్‌లో బాలు, భవాని అనే దంపతులు నివసిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దంపతులు ఇద్దరూ షాపింగ్‌కు వెళ్తూ తమ ఫ్లాట్‌కు తాళం వేసి వెళ్లారు. అంతకుముందే పక్కాగా రెక్కీ నిర్వహించిన ఆగంతకులు అదను కోసం వేచి చూశారు. దంపతులు లిఫ్ట్ దిగి బయటకు వెళ్లగానే ఓ అపరిచిత వ్యక్తి సెల్‌ఫోన్‌లో బిజీగా మాట్లాడుతున్నట్లు నటిస్తూ గ్రౌండ్ ఫ్లోర్‌లోని వాచ్‌మెన్ భార్య లక్ష్మితో బాలు, భవాని దంపతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా లిఫ్ట్ ఎక్కి 301 ఫ్లాట్‌కు చేరుకున్నాడు. వెంట తెచ్చుకున్న నకిలీ తాళంతో తలుపులు తీశాడు. నేరుగా బెడ్‌రూమ్‌లోకి వెళ్లి బీరువా తలుపులు తెరిచి అందులో ఉన్న 10తులాల బంగారం, రూ.5లక్షల నగదును కవర్‌లో చుట్టుకొని లిఫ్ట్ ద్వారా కిందకు దిగి ఉడాయించాడు. అయిదు నిమిషాల్లో షాపింగ్ ముగించుకొని ఇంటికి వచ్చిన బాలు, భవాని దంపతులు జరిగిన దొంగతనాన్ని చూసి నిర్ఘాంతపోయారు. షాక్ నుంచి తేరుకున్న దంపతులు వెంటనే టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని దొంగకు సంబంధించిన ఆధారాలు సేకరించారు. అనంతరం బాలు, భవాని దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగ కోసం గాలిస్తున్నారు.



బాధిత దంపతులు బాలు, భవాని



చోరీ జరిగిన తేజ అపార్ట్‌మెంట్

సంపులో పడి బాలుడు మృతి

● గజ్జెహళ్లి గ్రామంలో ఘటన
● డాక్టర్ అందుబాటులో లేకపోవడపై తల్లిదండ్రుల ఆగ్రహం



బాలుడి మృతికి కారణమైన నీటి సంపు



మృతి చెందిన బాలుడు వినోద్ (ఫైల్)

హొళగుంద, మార్చి 6: నీళ్ల తేవడానికి పోయిన నానమ్మతో పాటు వెళ్లి పక్కింటిలోని సంపులో పడిపోయి ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన హొళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మల్లికార్జున, నాగమ్మ దంపతులకు ముగ్గురు అబ్బాయిలు సంతానం. మల్లికార్జున తల్లి లక్ష్మి పక్కింటి సంపులో నీరు తెచ్చేందుకు వెళ్లగా చిన్న కుమారుడు వినోద్ (5) కూడా అనుసరించాడు. లక్ష్మి తిరిగి వచ్చాక అక్కడ తోటిపిల్లలతో ఆడుకుంటున్న వినోద్ సంప్‌లోకి తొంగి చూస్తూ అందులో పడిపోయాడు. ఇంటి వద్ద బాలుడు కనిపించక పోవడంతో సంపు వద్ద వెళ్లి చూడగా నీటిలో కొట్టుమిట్టాడుతూ కనిపించాడు. వెంటనే బాలుడ్ని వెలికి తీసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసికెళ్లారు. అక్కడ డాక్టర్లు అందుబాటులో లేరు. కేవలం స్టాఫ్ నర్సులు మాత్రమే ఉన్నారు. వాళ్లు ప్రథమ చికిత్స చేయకుండా ఆదోనికి తీసికెళ్లాలని చెప్పారు. ఆదోనికి వెళ్తుండగా మార్గమధ్యంలో బాలుడు మృతి చెందాడు. ఆస్పత్రిలో డాక్టర్ అందుబాటులో ఉండి ఉంటే బాలుడు బతికేవాడని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ ఎక్కడికి వెళ్లిందీ తెలియదని, ఆస్పత్రిలో వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండరని గ్రామస్థులు ఆరోపించారు. ఈ విషయంపై ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతిని వివరణ కోరగా ఆ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారని, ఒక్కరు కూడా అందుబాటులో లేకపోవడం విచారకరం అన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి డాక్టర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుదాఘాతంతో దుకాణదారుడు మృతి

● బ్లోయర్‌తో శుభ్రం చేస్తుండగా ఘటన

పత్తికొండ, మార్చి 6: పత్తికొండలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరుణాల సందర్భంగా ఫ్యాన్సీ దుకాణం ఏర్పాటు చేసుకున్న వన్నూర్‌బాషా (58) మంగళవారం అర్ధరాత్రి విద్యుదాఘాతానికి గురై మృ తి చెందాడు. మద్దికెరకు చెందిన వన్నూర్‌బాషాకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఫ్యాన్సీ వస్తువులు, గాజుల వ్యాపారం చేసే వన్నూరుబాషా కొద్ది సంవత్సరాల క్రితం మద్దికెర నుండి పత్తికొండ లక్ష్మీనగర్‌కు మారాడు. గ్రామాలలో తిరుగుతూ వ్యాపారం చేయడంతోపాటు తిరుణాలలు, దేవర ఉత్సవాలలో అంగడి ఏర్పాటు చేసుకొని వస్తువులను విక్రయిస్తుంటాడు. అలాగే ఫిబ్రవరి 29న ప్రారంభమైన పత్తికొండ తిరుణాళ్లలో దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. మంగళవారం రాత్రి 11.30కు దుకాణం మూసేశాక బ్లోయర్‌తో వస్తువులపై పడిన దుమ్మును దులిపే పనిలో పడ్డాడు. అయితే బ్లోయర్ వైర్‌కు అతుకు వేసిన టేప్ ఊడిపోయిన విషయం గమనించకపోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. పక్క దుకాణదారులు గమనించేలోగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు 857 మంది గైర్హాజరు

నంద్యాల టౌన్, మార్చి 6 : జిల్లాలో ఇంటర్ పరీక్షల్లో బుధవారం జరిగిన మొదటి సంవత్సరం వివిధ సబ్జెక్టుల పరీక్షలకు 857 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు మ్యాథ్స్, బాటనీ, సివిక్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు జరిగాయని అన్నారు. జనరల్ విభాగంలో 14,481 మంది విద్యార్థులకు గాను 13,737 మంది హాజరయ్యారని, 744 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 1,321 మంది విద్యార్థులను గాను 1,208 మంది విద్యార్థులు హాజరు కాగా 113 మంది విద్యార్థులు గైర్హాజరాయ్యరని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆమె వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరు, మార్చి 6: నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉగ్గన్న(33) అనే వ్యక్తి మృతి చెందారు. కల్లూరు మండలంలోని పందిపాడు గ్రామానికి చెందిన ఉగ్గన్న, ఆయన భార్య లక్ష్మీదేవి కోటప్పకొండలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రాగి ఉంగరాలు, కడియాలు వంటి వ్యాపారం చేసుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. రామయ్యకుంట బేస్ క్యాంప్ సమీపంలోని కానాల బ్రిడ్జి వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం వారి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉగ్గన్న అక్కడికక్కడే మృతిచెందగా లక్ష్మీదేవి స్వల్పగాయాలతో చెట్ల పొదల్లో పడిపోయింది. ఆత్మకూరు ఎస్సై నారాయణరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో రైతు..

బనగానపల్లె, మార్చి 6: బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన రైతు బ్రహ్మానందరెడ్డి (50) పంట పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు బనగానపల్లె పోలీసులు బుధవారం తెలిపారు. రైతు తన పంట పొలం వద్ద ఉన్న మోటారుకు మరమ్మతు చేసుకుంటూ ఉండగా మోటారుకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బ్రహ్మానందరెడ్డి ఎంతకీ ఇంటికి రాకపోవడం, ఫోన్ చేసినా ఫోన్ ఎత్తక పోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి పొలం వద్దకు వెళ్లి చూశారు. మృతి చెందిన బ్రహ్మానందరెడ్డిని చూసి విలపించారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుమారులు బ్రహ్మేశ్వరరెడ్డి, రవితేజారెడ్డి ఫిర్యాదు మేరకు బనగానపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టీడీపీ నాయకుడు గ్రామ ఉపసర్పంచ్ బొబ్బల గోపాల్‌రెడ్డి తదితరులు బ్రహ్మానందారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

దళితుల స్థలాలను ఇతరులకెలా ఇస్తారు?

పత్తికొండ, మార్చి 6: మద్దికెర సర్వే నంబర్ 444/2బీలో 4ఎకరాలను గతంలో తమకు కేటాయించారని, ఈ స్థలాలను అధికార పార్టీ నాయకులు వేరే వాళ్లకు ఎట్లా ఇస్తారని మద్దికెర దళితులు బుధవారం పత్తికొండ ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు రాఘవేంద్ర తనవెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో పక్కనే ఉన్న వ్యక్తులు అడ్డుకున్నారు. రాఘవేంద్రను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం రాత్రి నాలుగు స్తంభాల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు.

బీసీలంటే బ్యాక్ బోన్ క్లాసెస్ : మాజీ ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె, మార్చి 1: బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ క్లాసెస్ అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ బీసీ నాయకులతో కలసి విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ జయహో బీసీ డిక్లరేషన్‌ను టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కులగణన నిర్వహించి చంద్రన్న బీమా రూ.10లక్షలతో పునరుద్ధరిస్తామన్నారు. పెళ్లి కానుకను రూ. లక్షకు పెంచి శాశ్వత కులధృవీకరణ పత్రాలు అందిస్తామన్నారు. బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను ఏడాదిలో పూర్తిచేస్తామన్నారు ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూషణన్న, పట్టణ అధ్యక్షుడు ఖాశీంబాబు, చంద్ర, నరసింహులు, గురప్ప, మంగం పేట శ్రీనివాసులు, బాలనాయుడు, జనసేన నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్.. పగటి కలలు కనొద్దు

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), మార్చి 6: రానున్న ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రిగా వైజాగ్‌లోనే ప్రమాణ స్వీకారం చేస్తానని జగన్మోహన్‌రెడ్డి పగటి కలలు కంటున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ జగన్‌ను ప్రజలు ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో జగన్ తల్లి విశాఖలో పోటీ చేసి ఎంతో ఘోరంగా ఓటమి చెందారో జగన్ గుర్తించుకోవాలన్నారు. ఒక్క అవకాశం ఇచ్చిన పాపానికి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. స్వార్థ ప్రయోజనాల కోసం విశాఖలో పేరు గాంచిన రుషికొండను నాశనం చేశావని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

క్వారీలను పరిశీలించిన గనుల శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్), మార్చి 6: జిల్లాలోని పలు క్వారీలను గనుల శాఖాధికారులు పరిశీలించినట్లు జిల్లా గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం దూదేకొండలోని గ్రానైట్ క్వారీలపై వచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడ తనిఖీ నిర్వహించి, రికార్డులు పరిశీలించామని తెలిపారు. గ్రానైట్ క్వారీ ఎస్వీ మెటల్ క్రషింగ్ స్టోన్ కషర్ పనితీరును అడిగి తెలుసుకుని స్టాక్ వివరాలను సేకరించారు. విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు

తాగునీటి సమస్య రానివ్వొద్దు

గూడూరు, మార్చి 6: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జయశ్రీ అన్నారు. బుధవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఎండల తీవ్రత కారణంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సూచించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే చర్యలు చేపట్టి పరిష్కరించాలన్నారు. ఎండల తీవ్రత కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఏఈ గోపాల్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సనా, ఈవోఆర్డీ మధులత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రసాయన విపత్తుపై మాక్ డ్రిల్

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 6: కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలోని టీజీవీ రాయలసీమ ఆల్కలీస్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో నేడు ఉదయం 8.30 గంటలకు మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ. నారాయణరెడ్డి తెలిపారు. పరిశ్రమలో అనుకోని ప్రమాద సమయంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు నిర్వహించే మాక్‌డ్రిల్‌లో భాగంగా గొందిపర్ల గ్రామంలోని టీజీవీ రాయలసీమ ఆల్కలీస్, అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో మాక్‌డ్రిల్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చట్టాన్ని ధిక్కరిస్తే కఠిన చర్యలు

సి. బెళగల్, మార్చి 6: చట్టాన్ని ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని గొల్లలదొడ్డి, కొండాపురం, పోలకల్లు, ఇనగండ్ల గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ ముఖాముఖి మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు గ్రామాలలో ఎటువంటి మనస్పర్థలు పెంచుకోకుండా ఒకరినొకరు సోదర భావంతో కలిసి మెలసి జీవించాలన్నారు. ఎస్ఐ వెంట హెడ్ కానిస్టేబుల్, పోలీసులు ఉన్నారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా చిన్న రామాంజనేయులు

కర్నూలు(అర్బన్), మార్చి 6: కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా చిన్న రామాంజనేయులును నియమించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కే. బాబు రావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడమే కర్తవ్యమని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజల్లో చైతన్యం తెస్తామని తెలిపారు.

రాష్ట్రం పరువు తీస్తున్న జగన్



ఓర్వకల్లులో టీడీపీ మేనిఫెస్టో పథకాలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడి

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, మార్చి 6: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రం పరువు పోయేలా పరిపాలిస్తున్నారని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లులో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతకుముందు ఆమెకు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి ఆంధ్రప్రదేశ్ పరువు తీస్తున్నారని అన్నారు. మంగళగిరిలో జరిగిన జయహో బీసీ సభలో బీసీల కోసం పది అంశాలతో బీసీ డిక్లరేషన్ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ విడుదల చేశారని అన్నారు. బీసీలకు ప్రత్యేక చట్టం, సబ్‌ప్లాన్‌కు ఐదేళ్లలో లక్షన్నర కోట్లు, స్థానిక సంస్థల్లో 34 రిజర్వేషన్లు, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి, ప్రోత్సాహకాల పునరుద్ధరణ, విద్యాపథకాల పునరుద్ధరణ తదితర పథకాలు టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పులపాల్జేసి ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టాడని, సంపద సృష్టించలేని సీఎం జగన్‌కు రాష్ట్రాన్ని పరిపాలించే హక్కు లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితి కూడ నెలకొందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కుటుంబంలో పిల్లలు ఎంత మంది చదువుకుంటున్నా వారికి ఏడాదికి రూ.15వేలు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లతో పాటు 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు రూ.1,500 టీడీపీ ప్రభుత్వ ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, రామకోటేశ్వరరావు, సుధాకర్ రావు అన్వర్‌బాషా, అబ్దుల్లా, వేణుగోపాల్ రెడ్డి కురువ జయన్న, కురువ సుంకన్న, అల్లాబాబు, ఏసేపు, నాగరాజు, శ్రీరాములు, ఆదాంబాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్‌రెడ్డి

కల్లూరు, మార్చి 6: ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలండర్ విడుదల చేస్తానని నిరుద్యోగులను నమ్మించి సీఎం జగన్ మోసం చేశాడని పాణ్యం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మాధవీనగర్‌లోని తన స్వగృహంలో 12న నిర్వహించే రాయలసీమ నిరుద్యోగ గర్జన వాల్ పోస్టర్‌ను గౌరు దంపతులు విడుదల చేశారు. రాయలసీమ యువ జన సంఘాల జేఏసీ చైర్మన్ బి.శ్రీరాములు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు. గర్జనసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పాలకొలను సుదాకర్‌రెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాగరాజు, అయ్యస్వామి, కోనేటి వెంకటేశ్వర్లు, రాజు, భరత్, రవి, నవీన్, సురేంద్ర పాల్గొన్నారు.

టీడీపీలోకి ఇద్దరు వైసీపీ ఎంపీటీసీలు



టీడీపీలో చేరుతున్న బెళగల్ మండలం ఎంపీటీసీ సభ్యులు

కర్నూలు(రూరల్)/సీ.బెళగల్, మార్చి6: కోడుమూరు నియోజకవర్గంలో ఇద్దరు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అందులో సీ.బెళగల్ మండల ఎంపీటీసీ సభ్యుడు ఈరన్నగౌడ్, కర్నూలులో టీడీపీ సీనియర్‌నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి దస్తగిరిని భారీ మెజారిటీతో గెలిపించి కోడుమూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ప్రతి ఒక్క కుటుంబాన్ని కలిసి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోక యువతకు ఉపాధి లేక పక్క రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. సర్పంచు, ఎంపీటీసీ సభ్యులపై వైసీపీ ప్రభుత్వానికి చిన్నచూపు ఉండటంతోనే వారికి ఆ పార్టీపై వారికి నమ్మకం లేక టీడీపీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరినవారిలో బెళగల్ మండలం మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఈర్లదిన్నె వెంకట్రామిరెడ్డి, గోపాల్‌గౌడ్, మల్లికార్జునగౌడ్,క్రిష్ణాగౌడ్, శేఖర్‌గౌడ్, సోమేష్‌గౌడ్, మరికొంత మంది చేరారు.

● కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యులు జూటూరు శైలజ, ఆమె కుమారుడు గ్రామ ఉపసర్పంచు జూటూరు కౌశిక్‌రెడ్డి కలిసి టీడీపీలో చేరారు. వారికి విష్ణువర్ధన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితో పాటు మరికొంత మంది వైసీపీ యువకులు టీడీపీలో చేరారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



ఆర్ కానాపురంలో బొగ్గుల దస్తగిరిని సన్మానిస్తున్న గ్రామస్తులు

గూడూరు, మార్చి 6: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని కోడుమూరు నియోజక వర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం గూడూరు మండలంలోని ఆర్ కానాపురం గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి టీడీపీని గెలిపించి అభివృద్ధికి బాటు వేయాలని పిలుపునిచ్చారు. దస్తగిరి మాట్లాడుతూ కోడుమూరు కోటపై టీడీపీ జెండాను ఎగురవేసి టీడీపీకి పూర్వ వైభవం తెద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మన్యంకొండ, మాజీ నగర పంచాయతీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, జె సురేష్, పౌలు, విజయ్ కుమార్, కూరగాయల చాంద్ బాషా, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిశామని కక్ష కట్టారు

● వైసీపీ నాయకుల చేష్టలపై వ్యాపారుల ఆగ్రహం
● టీజీ భరత్ భరోసా యాత్రలో బాధితుల ఆవేదన



సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న టీజీ భరత్



తొలగించిన బంకును పరిశీలిస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 6: యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌ను కలిసి, ఫొటో తీయించుకుంటే మరుసటి రోజే వైసీపీ నాయకులు కక్ష కట్టి తమ కిరాణ బంకులను తొలగించారని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. భరోసాయాత్రలో భాగంగా పర్యటించిన టీజీ భరత్ ఎదుట బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. బుధవారం నగరంలోని 3వ వార్డులోని బండిమెట్టలో టీజీ భరత్ భరోసా యాత్ర కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు వైసీపీ చేస్తున్న అరాచకాలను టీజీ భరత్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 40 రోజుల్లో ఎన్నికలు రానున్నాయని, ప్రజలందరూ తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తాము అధికారం చేపట్టాక వ్యాపారులకు భరోసా పాటు నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటామన్నారు. తాను ఐదేళ్లలో చేసే అభివృద్ధి 20 ఏళ్ల పాటు ప్రజలకు మంచి జీవితం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగ వీరాంజనేయులు, ఉమామహేశ్వరి, నరేష్, కిరణ్, శ్రీనివాసులు, గౌస్, రమేష్, మోహన్, లాల్, జనసేన కార్యకర్తలు శ్రీనివాసరెడ్డి, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 6: ప్రజల అవసరం మేరకు పరిమితంగా పోలింగ్ స్టేషన్ల పేరు, స్థానం మార్చామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే రాతపూర్వకంగా తెలపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బహుజన పార్టీ ఏ. అరుణ్ కుమార్, బీజేపీ పీటీ సాయిప్రదీప్, వైసీపీ ఎస్.రాజేష్‌బాబు, కాంగ్రెస్ పార్టీ జాన్‌విల్సన్, టీడీపీ ఎల్‌వీ ప్రసాద్, సీపీఐ (ఎం) గౌస్‌దేశాయ్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

కవి జయరాం కన్నుమూత



కవి డాక్టర్ మండ్ల జయరాం (ఫైల్)

కర్నూలు(కల్చరల్), మార్చి 6: కర్నూలు జిల్లాకు చెందిన కవి, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మాజీ అధ్యక్షుడు డాక్టర్ మండ్ల జయరాం (52) బుధవారం కన్నుమూశారు. కోడుమూరు మండలం, ప్యాలకుర్తి జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆయన గత నాలుగు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. కర్నూలు సర్వజన వైద్యశాలలో చేరి చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. జయరాం మృతి పట్లు పలు సాహిత్య సంస్థలు తమ సంతాపం వ్యక్తం చేశాయి. జయరాం అకాల మరణం సాహితీరంగానికి తీరని లోటని సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. జయరాం స్వగ్రామం దేవమడలో ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ సాహితీ స్రవంతి నిర్వహించిన అనేక సభల్లో ఆయన పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. సాహిత్య ప్రస్థానం పత్రికకు అనేక వ్యాసాలు రాశారని, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. సహృదయుడైన సాహితీవేత్తను అరసం కోల్పోయిందని అరసం జిల్లా నాయకుడు సయ్యద్ జహీర్ అహ్మద్ కొనియాడారు. కవిగా, పరిశోధకునిగా అనేక సాహిత్య వ్యాసాలు రాసిన జయరాం సేవలు స్మరణీయమని రాయలసీమ ప్రచురణలు గౌరవ సంపాదకుడు మారుతీ పౌరోహితం, ప్రధాన సంపాదకుడు ఇనాయతుల్లా ఒక సంతాప ప్రకటనలో పేర్కొన్నారు.

రాంబొట్ల దేవాలయం అభివృద్ధికి రూ.1.50 లక్షలు

కర్నూలు(కల్చరల్), మార్చి 6: అయోధ్య రామాలయం స్ఫూర్తితో నగరంలోని అతి పురాతన దేవాలయం రాంబొట్ల దేవాలయం, సత్యనారాయణ స్వామి దేవాలయాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషిచేస్తామని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలోని వాసవీ మహిళా కళాశాల్లో రాంబొట్ల దేవాలయం, సత్యనారాయణ స్వామి ఆలయాల అభివృద్ధికి ఆయన రూ.1,50,000 విరాళం చెక్కును దేవాలయాల చైర్మన్లకు అందజేశారు. కార్యక్రమంలో వాసవి మహిళా కళాశాల అధినేత సోమిశెట్టి వెంకట్రామయ్య, 46వ వార్డు కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు, కొత్తపేట సత్యనారాయణస్వామి ఆలయం చైర్మన్ కృష్ణకాంత్‌శర్మ పాల్గొన్నారు.

కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో కరాటే బెల్టు టెస్టు

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 6: యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో 38 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.దేవికారాణి మాట్లాడుతూ ఈ రోజుల్లో మహిళలకు కరాటే, ఉషూ లాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు.అనంతరం కలర్ బెల్టులు సాధించిన విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు ఎ.సునిత, సంగీత, పి.మౌనిక, పూజితలు, మాస్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించండి

ఓర్వకల్లు, మార్చి 6: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని దేవాదాయ ధర్మాదాయ ఉప కమిషనర్ గురుప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరం ఆలయంలో జరుగుతున్న మౌలిక సదుపాయాల కల్పనను ఆయన పరిశీలించారు. అనంతరం శివునికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. కాల్వబుగ్గలో శివరాత్రి సందర్భంగా వసతులు పరిశీలించిన అనంతరం ఆయన అధికారులను అభినందించారు. ఆయన వెంట ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి జగన్నాథ గట్టుపై శివరాత్రి ఉత్సవాలు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న రూపాల సంగమేశ్వర స్వామి జగన్నాథగట్టు అభివృద్ధి సమితి ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), మార్చి 6: నగర శివారులోని జగన్నాథ గట్టుపై ఉమాసహిత రూపాల సంగమేశ్వర స్వామి దేవాలయంలో గురువారం నుంచి శనివారం వరకు శివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి ప్రతినిధులు తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమీపంలోని సాలమ్మ సత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శివరాత్రి మహోత్సవాల వివరాలు తెలిపే కరపత్రాన్ని వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, రుద్రహోమం, ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. శుక్రవారం రుద్రహోమం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, శనివారం తెల్లవారుజామున కల్యాణోత్సవం, పల్లకీ సేవ, ఉదయం పూర్ణాహుతి ఉంటాయని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల రథోత్సవం ఉంటుందని తెలిపారు. జగన్నాథ గట్టుకు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. శివరాత్రి రోజున దివంగత పెరుగు సీతారామిరెడ్డి స్మారకార్థం ఆయన కుమారులు నిరంతర అన్నప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శివరాత్రి జాగరణ సందర్భంగా శుక్రవారం రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో దేవాలయం ఈవో ప్రసన్నలక్ష్మి, సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వాసుదేవయ్య, నందడి మహేశ్, ఆదిత్య వాసుదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

కర్నూలు(లీగల్), మార్చి 6: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు తమ హక్కులు కాపాడుకునేందుకు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అందుకు అక్షరాస్యత పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మహిళలకు అవసరమైన న్యాయ సహాయాన్ని అర్హులైన వారికి తాము ఉచితంగా అందజేస్తామని, బాధితులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఆయన వివిధ చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్, పొదుపు సంఘం మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించడంలో విఫలం



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

కోడుమూరు, మార్చి 6: జిల్లాలో ఉపాధి పనులు లేక వ్యవసాయ కూలీలు పొట్ట చేత పట్టి ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళి పోతున్నారని, అయినా పనులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. స్థానిక స్నేహ కల్యాణ మండపంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయ్యాయని అన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోవడంతో జనం లేక గ్రామాలు బోసిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. జిల్లా కరువు నివారణకు రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవుల శేఖర్, వెంకట్రావు, కేశవరెడ్డి, కృష్ణ, శేషుకుమార్, భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 6: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పోలంకి రామస్వామి, విట్టా రమేష్, పురుషోత్త ంరెడ్డి, మురహరి రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని బీఏఎస్ కళ్యాణ మండపంలో కన్వీనర్ రంగాస్వామి అధ్యక్షతన కర్నూలు జిల్లా బీజేపీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి భరతమాత, దీన్‌దయాల్, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం విశ్వకర్మ యోజన పర్యవేక్షక సభ్యులుగా నియమితులైన కాలింగి నరసింహవర్మ, మలేకర్ శ్రీనివాసులు, కాశీవిశ్వనాథ్‌లకు సన్మానం చేశారు.

గ్రంథాలయ ఉద్యోగులకు సత్కారం

కర్నూలు(కల్చరల్), మార్చి 6: ఈ ఏడాదిలో ఉత్తమ సేవలు అందించిన గ్రంథాలయ సంస్థ ఉద్యోగులను బుధవారం ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్‌చంద్రబోస్ విచ్చేసి ఉద్యోగులను శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు గ్రంథాలయ సభ్యత్వాలు పెంచడంతోపాటు సెస్ వసూళ్ల వసూలు చేయడంలో శ్రద్ధ చూపాలని, తద్వారా గ్రంథాలయాలకు మరింత ఆర్థిక పరిపుష్టి లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు వి. పెద్దక్క, గ్రంథాలయ అధికారి వజ్రాల గోవిందరెడ్డి తదితరులు ఉన్నారు. సత్కార గ్రహీతల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్, అరుణకుమారి, బి. మధునాయుడు, డి. మధు, ఎస్ రాధాబాయి, ఎం. అరుణకుమారి, శ్రీధర్ గౌడ్, ఎన్ వెంకటేశ్వర్లు, ఎస్ బాషా, బి. ఈశ్వరమ్మ, మగ్బుల్‌బాషా, సుదర్శన్ కుమార్, ఎన్. రాకేశ్, కె. సుజాత, వి. భవానీ, బాలతిమ్మారెడ్డి ఉన్నారు.

ఉద్యోగులకు క్రీడా పోటీలు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా ఉద్యోగులకు ఆట పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళా ఉద్యోగులకు కలెక్టర్ కార్యాలయంలోని బుధవారం కలెక్టర్ జి.సృజన బహుమతులు అందజేశారు.

మహిళలు సంఘటితపడి ప్రతిభచాటాలి

కల్లూరు, మార్చి 6: మహిళలు సంఘటితంగా పోరాడి ప్రతిభ చాటాలని ఉమ్మడి జిల్లా నాబార్డు డీడీఎం యం. సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో నాబార్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాబార్డు డిడిఎం యం.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన పాఠశాల విద్యార్థినులకు పీడీ ఉమాదేవి, ఎల్‌డీఎం. రామచంద్రారెడ్డి బహుమతి ప్రదానం చేశారు. అలాగే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్లకు, రైతు ఉత్పత్తిదారులకు సీఈఓ శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు సీఈఓ విజయ్‌కుమార్, అప్కాబ్ నహిదాసుల్తానా, ప్రిన్సిపాల్ స్వప్నకుమారి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 6: ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధిస్తారని సెట్కూరు సీఈవో రమణ అన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జడ్పీహెచ్‌ఎస్ పడిదెంపాడు నందు సెయింట్‌జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 సహకారంతో వ్యక్తిత్వ వికాస, కెరీర్ కౌన్సిలింగ్, హ్యాపీ ఎగ్జామ్స్ ఉపాధి అవకాశాలపై ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. వార్త పత్రికలు చదవడం, విషయం పరిజ్ఞాన కరెంటు అఫైర్స్, ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని సీఈవో తెలిపారు. కార్యక్రమంలో సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె.శ్రావణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సమావేశం

● అత్యవసరంగా అధికారుల సమావేశం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 6: నగర పాలక సంస్థకు సంబంధించి స్టాండింగ్ కమిటీ సమావేశం 60 రోజులోపు చేయాలని నిబంధనలు ఉన్నాయి. కానీ రెండు వారాల క్రితం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కేవలం అధికారులను మభ్యపెట్టేందుకు, వైసీపీ నాయకుల మన్ననలు పొందేందుకు నగర పాలక సంస్థ అధికారులు అత్యవసర స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం లేదా మధ్యాహ్నం జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని రాత్రి 8 గంటల సమయంలో మేయర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇదంతా చూస్తుంటే.. కేవలం వైసీపీకి ప్రలోభాలకు గురి చేసే విధంగా ఉన్నట్లు కొందరు కార్పొరేటర్లు చర్చించుకుంటున్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఓర్వకల్లు, మార్చి 6: రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. మండలంలోని బైరాపురం, ఓర్వకల్లు, శకునాల గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న, ఎంపీడీవో మల్లీశ్వరి, తహసీల్దార్ నటరాజ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అరసం నేత జయరాం మృతి బాధాకరం


అరసం జిల్లా మాజీ అధ్యక్షుడు జయరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 6: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మాజీ జిల్లా అధ్యక్షుడు జయరాం మృతి బాధాకరమని అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద అన్నారు. బుధవారం జయరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అభ్యుదయ రచయితల సంఘం అభివృద్ధికి, సాహిత్య విస్తృతికి ఎంతో కృషి చేశారన్నారు. జయరాం సాహితీ కారులకు మంచి మిత్రుడని అన్నారు. ఆచార్య డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి దగ్గర పదేళ్ల కథ వార్షికలు, వాస్తు శిల్పాలు అనే అంశం మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందారన్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన అకాల మరణం అరసం జిల్లా శాఖకు తీరని లోటని పేర్కొన్నారు.

చౌక దుకాణాలపై విజిలెన్స్ దాడులు

రాగులు, పిండి, చెక్కర బొక్కేసిన డీలర్లు

దేవనకొండ, మార్చి 6 : దేవనకొండలోని 16, 17 చౌక దుకాణాలపై బుధవారం విజిలెన్స్ సీఐ రామకృష్ణ అధ్వర్యంలో దాడులు చేసి ప్రజలకు అందాల్సిన నిత్యావసర సరుకులు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ప్రజలకు అందాల్సిన బియ్యం, రాగులు, రాగిపిండి, చెక్కర, జొన్నల నిల్వలు తేడాలను గుర్తించిన అధికారులు రెండు దుకాణాలను సీజ్ చేశారు. ప్రజలకు అందాల్సిన నిత్యావసర వస్తువులైన బియ్యంతో పాటు చెక్కర నల్ల బజారులోకి తరలించినట్లు పేర్కొన్నారు. 16వ చౌక దుకాణంలో రాగులు 376, రాగి పిండి 511, చెక్కర 367 కేజీలలో తేడా వుందని, 17 దుకాణంలో బియ్యం 128, జొన్నలు 150, రాగులు 500, రాగిపిండి 300, చెక్కర 118 కిలోలు నిల్వలు తేడా వున్నాయని, ఈ రెండు దుకాణాల నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకొని, వారి డీలర్‌షిప్పులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సివిల్ సప్లయ్ అధికారి రూపస్ రోనాల్డ్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, వీఆర్వో జాకీర్ సిబ్బంది శివకుమార్ తదితరులు ఉన్నారు.

బుట్టా రేణుకకు తొలి రోజే నిలదీతలు

ఎమ్మిగనూరు, మార్చి 6: వైసీపీ ఎమ్మిగనూరు సమన్వయకర్త బుటా రేణుక ప్రచారం ప్రారంభించిన మొదటిరోజే నిలదీతలు ఎదురయ్యాయి. బుధవారం పట్టణంలోని ఆరో వార్డులో బుట్టా రేణుక ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతున్న ఆమెను ఓ ఇంటి దగ్గర వనజ అనే మహిళ తన పిల్లలకు అమ్మఒడి రావటం లేదని, అన్ని పత్రాలు సక్రమంగా ఇచ్చినా ఎవరూ పట్టించుకోవటం లేదు అంటు బుట్టా రేణుకను నిలదీశారు. అలాగే మరో వృద్ధురాలు డ్రైనేజీలు లేవు, తాగునీరు సక్రమంగా రావు, ఓట్లప్పుడు మాత్రం అందరూ వస్తారు అంటు బుట్టా రేణుకను నిలదీశారు.

మానవ హక్కుల అసోసియేషన్ చైర్మన్‌గా శ్రీనివాసులు

ఎమ్మిగనూరు,మార్చి 6: మానవ హక్కులు, యాంటీ కరప్షన్ అసోసియేషన్ కర్నూలు జిల్లా చైర్మన్‌గా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన శ్రీనివాసులును నియమిస్తూ ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు గండారెడ్డి మల్లికార్జునరెడ్డి నియమించారు. ఈ మేరకు ఆయన ఐడీకార్డు, నియామక ఉత్తర్వులు అందించినట్లు శ్రీనివాసులు తెలిపారు.

తిక్కారెడ్డి గెలవాలని తిరుపతిలో ప్రత్యేక పూజలు

పెద్దకడుబూరు మార్చి6: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి గెలవాలని బసలదొడ్డి గ్రామానికి చెందిన ఐటీడీపీ సభ్యులు కృష్ణ, చిదానంద, నాగేష్ బుధవారం తిరుపతిలోని అలిపిరిలో ఉన్న 3,550 మెట్లకు ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని వారి కష్టాలు తీర్చేందుకు తిక్కారెడ్డిని అత్యధిక మెజార్టీతో ప్రజలు గెలిపించాలని తిరుపతి వెంకన్న దర్శనం చేసుకుంటున్నామన్నారు. త్వరలో రాక్షస పాలనకు చరమగీతం పలికి చంద్రన్న రాజ్యం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అగ్రహారంలో దుర్గా మాత విగ్రహ ప్రతిష్ఠ

గోనెగండ్ల, మార్చి 6: బీ అగ్రహారం గ్రామంలో దుర్గా మాత నూతన దేవాలయాన్ని నిర్మించి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో చేపట్టారు. కార్యక్రమానికి అగ్రహారం గ్రామస్థులే కాక కర్నూలు, బళ్లారి, మహబుబ్‌నగర్, ఆదోని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కేంద్రమాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎమ్మిగనూరు టీడీపీ నాయకులు మాచాని సోమనాథ్, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుశీలమ్మవ్వ కొండల్లో చెలరేగిన మంటలు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 6: ఎమ్మిగనూరు సమీపంలోని సుశీలమ్మవ్వ కొండలో బుధవారం రాత్రి మంటలు చెలరేగాయి. కొందరు ఆకతాయిలు కొండ ప్రాంతంలో నిప్పు రగిల్చారని స్థానికులు తెలిపారు. గ్రామస్థులు ప్రయత్నించినా మంటలు నియంత్రణలోకి రాలేదని పేర్కొన్నారు.

విడ్డూరం.. చెప్పుకోలేకున్నాం..!

- ప్రజాప్రతినిధుల వేతన యాతన
- మే నుంచి అందని గౌరవ వేతనాలు
- ఏ కౌన్సిల్ హయాంలోనూ ఈ స్థితి చూడలేదు
- ఎవరిని అడగాలో తెలియక కౌన్సిలర్ల ఎదురు చూపు

ఆదోని టౌన్, మార్చి 6: 'ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. అభివృద్ధి పనులకు సర్కార్ దగ్గర పైసలు లేవు. ఉద్యోగులు, పెన్షనర్లు ప్రతి నెలా జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక మా పరిస్థితి మరీ విడ్డూరం.. మాకివ్వాల్సిన గౌరవ వేతనం తొమ్మిది నెలలుగా బకాయి. ఏ కౌన్సిల్ హయాంలోనూ ఈ దుస్థితి చూడలేదు. మేం ప్రజాప్రతినిధులం.. మా బాధలు ఎవరితోనూ చెప్పుకోలేకున్నాం' ఇదీ ఆదోని మున్సిపల్ కౌన్సిలర్ల వేదన. వీరి సమస్య నిజంగానే విడ్డూరం. పట్టణంలోని వివిధ వార్డులలో నెలకొన్న సమస్యలతో పాటు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి పరిష్కారం కోసం కృషిచేసే కౌన్సిలర్లు సైతం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. వారికి తొమ్మిది నెలలుగా ప్రభుత్వం నుంచి వేతనాలు విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో 42 వార్డులుండగా, 42 మంది ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లుగా ప్రాతినిత్యం వహిస్తున్నారు. ఇందులో ఒకరు చైర్మన్ కాగా, ఇద్దరు వైస్ చైర్మన్లుగా ఉన్నారు. ప్రతి నెలా కౌన్సిలర్లకు రూ.3,500, వైస్ చైర్మన్లకు రూ.7,000, చైర్ పర్సన్‌కు రూ.15,000, ప్రకారం గౌరవ వేతనం అందాల్సి ఉంది. గత ఏడాది మే నెల నుంచి వారికి అందాల్సిన గౌరవ వేతనం ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రూ.13-76 లక్షల దాకా బకాయిలు పేరుకొని పోయాయి. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లే ప్రజాప్రతినిధులు తమ సమస్యలను ఎవరికి విన్నవించాలో తెలియని స్థితిలో సతమతమవుతున్నారు. 'అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఎలాగూ నిధులను విడుదల చేయడం లేదు.. ఉద్యోగులు, పెన్షనర్లు ఒకటవ తేదీని మర్చిపోయారు. ఇక మాకివ్వాల్సిన గౌరవ వేతనం తొమ్మిది నెలలుగా బకాయి పడ్డాయి. ఇలాంటి స్థితి ఎన్నడూ చూడలేదు' అంటూ కౌన్సిలర్లు వాపోతున్నారు. కౌన్సిల్‌లో ఒక్కరు తప్ప అందరూ వైసీపీకి చెందిన వారే కావడంతో తమ గౌరవ వేతనం గురించి బహిరంగంగా చెప్పుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని వాపోతున్నారు.

గతంలో ఎన్నడూ ఈ స్థితి చూడలేదు



తొమ్మిది నెలలకు పైగా కౌన్సిలర్ల గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు. మా సమస్య చాలా విడ్డూరంగా ఉంది. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదు. ఏ కౌన్సిల్ హయాంలోనూ ఈ దుస్థితి చూడలేదు. రాష్ట్ర ప్రభుత్వం దివాళా తీసింది. ఈ పరిస్థితి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని స్పష్టంగా చూపుతోంది.

- బీ పార్వతి, టీడీపీ కౌన్సిలర్

టీడీపీలో చేరిన వైసీపీ జడ్పీటీసీ


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జెడ్పీటీసీ లింగప్ప

హాలహర్వి, మార్చి 6: తెలుగుదేశం పార్టీతోనే ప్రగతి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప అన్నారు. బుధవారం అమరావతిలో చంద్రబాబు సమక్షంలో వైసీపీ జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నిన్న గుమ్మనూరు జయరాం పార్టీలోకి చేరారు. ఆయన అనుచరులు బాపురం సర్పంచ్ భర్త నాగేంద్ర, గూళ్యం దిబ్బలింగ, నిట్రవట్టి లక్ష్మన్న తదితరులు దాదాపు వంద మంది నాయకులు వైసీపీ నుంచి టీడీపీ పార్టీ కండువా కప్పుకున్నారు

చంద్రబాబును కలిసిన వీరభద్ర గౌడ్


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, మార్చి 6: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును బుధవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఆయన కుమారుడు గిరి మల్లేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లు ఆయన తెలిపారు.

బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదు.. టీడీపీ బ్యాక్ బోన్

- బీసీ డిక్లరేషన్‌పై మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు
- పత్తికొండ, నందవరంలో వేర్వేరు సమావేశాలు

నందవరం/పత్తికొండ : బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదు... టీడీపీ పార్టీ బ్యాక్‌బోన్ అని టీడీపీ నేతలు అన్నారు. బుధవారం నందవరం, పత్తికొండ టీడీపీ కార్యాయాల్లో వేర్వేరుగా బీసీ డిక్లరేషన్‌పై ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు మాట్లాడారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ బీసీలకు రాజకీయప్రాధాన్యత కల్పించి చట్టసభలకు వెళ్లేఅవకాశం కల్పించారన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచే బీసీల సంక్షేమం కోసమే ఎన్నో సంక్షేమ పథకాలను అందించిందని గుర్తుచేశారు. స్థానికసంస్థల్లో 34శాతం ఉన్న బీసీరిజర్వేషన్‌ను వైసీపీ 24శాతానికి తగ్గించడంతో స్థానికసంస్థల ఎన్నికలలో బీసీలు రాజకీయంగా నష్టపోయారన్నారు. తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 34శాతం రిజర్వేషన్‌ను అమల్లోకి తెస్తామని చంద్రబాబు ప్రకటించడం హర్షనీయమని పేర్కొన్నారు. బీసీలకు 50 సంవత్సరాలు దాటితే పింఛన్‌సదుపాయం, బీసీసబ్‌ప్లాన్‌ద్వారా వారి ఆర్థిక ఎదుగుదలకు అవకాశం, ఉపాధిప్రోత్సాహకాలు వంటి పథకాలు అమలుటీడీపీ అధికారంలోకి వచ్చినవెంటనే అమలవుతాయన్నారు. బీసీల అభివృద్ధికి ప్రత్యేకపథకాలు ఏర్పాటుచేయకపోగా అందుబాటులో ఉన్న పథకాలను రద్దుచేసి బీసీలను అన్నిరకాలు దగాచేసిన ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని విమర్శించారు. .చంద్రన్న బీమాద్వారా 10లక్షల పరిహారం, విద్యాపథకాల పునరుద్ధరణ, పెళ్లికానుక, బసీ కమ్యూనిటీ భవనాలు నిర్మాణాలు టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే అందుబాటులోకి వస్తాయన్నారు. బీసీల సంక్షేమం కావాలంటే వచ్చే ఎన్నికలలో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత ప్రతిబీసీ కుటుంబంపై ఉందని స్పష్టం చేశారు. బీసీలను అన్నిరకాలుగా మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి నిల్


ఎమ్మిగనూరులో మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ


కే తిమ్మాపురంలో మాట్లాడుతున్న డాక్టర్ సోంనాథ్

ఎమ్మిగనూరు,మార్చి 6: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎమ్మిగనూరు పట్టణం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 8వ వార్డులో, నందవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీవీ పాల్గొని టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమం పేరుతో బటన్ నొక్కుతున్నానని చెబుతూ ధరలు పెంచి పేదల పీకలు నొక్కుతున్నాడని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. నాయకులు కొండయ్య చౌదరి, సుందరరాజు, రామకృష్ణనాయుడు, కలీముల్లా,రంగస్వామిగౌడ్, మల్లి, శీను, ఉరుకుందు, బాషా, కృష్ణతేజ నాయుడులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని బాబు జగ్జీవన్ కాలనీ, ఎరుకలవీధి, క్రాంతినగర్, మండల పరిధిలోని కే తిమ్మాపురంలో టీడీపీ నాయకుడు డాక్టర్ సోంనాథ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మల్లికార్జున, చంద్రన్న, అల్తాఫ్, కందనాతి శ్రీనివాసులు, చిన్న హనుమంతు, వీరేష్, సోమప్ప,గోపాల్, నరసప్ప, మార్కు, శంకరన్నలు పాల్గొన్నారు.

నేడు నారా భువనేశ్వరి రాక

ఆస్పరి, మార్చి 6: టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం మండలానికి రానున్నట్లు మండల కన్వీనర్ పరామరెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమే గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగా అలిగేర గ్రామంలో చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో భావోద్వేగానికి గురై గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ఉరుకుందప్ప కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మతో కార్యక్రమం గూర్చి చర్చించినట్లు పేర్కొన్నారు.

చంద్రబాబును కలిసిన వీరభద్ర గౌడ్

ఆలూరు, మార్చి 6: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును బుధవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఆయన కుమారుడు గిరి మల్లేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ గ్రంథాలయ అధికారిగా వెంకటేశ్వర్లు

ఆలూరు, మార్చి 6: జిల్లా ఉత్తమ గ్రంథాలయ అధికారిగా ఆలూరు లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్నారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించి గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయనకు ఈ అవార్డు లభించింది.

పాత పెన్షన్ విధానాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 6: ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని మేనిఫెస్టోలో చేర్చిన రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రుద్రముని అన్నారు. బుధవారం మండలంలోని సంతేకూడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ముద్రించిన ఓట్ ఫర్ ఓపీఎస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకమునపు వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తానని మాట తప్పారన్నారు. సీపీఎస్ వల్ల ఆర్థిక నష్టంతో పాటు కుటుంబానికి భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామాంజనేయులు, ఉసేని పాల్గొన్నారు.

మండల సభ వాయిదా

చిప్పగిరి, మార్చి 6: చిప్పగిరి మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ జూటూరు హేమలత అర్థాంతరంగా వాయిదా వేశారు. బుధవారం ఎంపీపీ జూటూరు హేమలత ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. సమావేశం ప్రారంభం కాకముందే ముఖ్యఅతిథిగా సమావేశానికి హాజరైనా ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ నిబంధనల ప్రకారం సర్పంచులు, ఎంపీటీసీలు ఎన్నికైనా ప్రజాప్రతినిధులు ఉండాలని సూచించారు. దీంతో సమావేశానికి వచ్చిన సర్పంచ్, ఎంపీటీసీల భర్తలు సమావేశం నుండి బయటకు వెళ్లిపోయారు. దీంతో సమావేశం ఖాళీ కుర్చీలతో వెలవెలపోయింది. తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో బారస్ సాబ్, ఈవోఆర్డీ బాలన్న పాల్గొన్నారు.

హరికథల ద్వారా భక్తి భావం పెరుగుతుంది

- మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, మార్చి 6: హరికథామృతంతో భక్తులకు భక్తిభావం మరింత పెరిగేవిధంగా తోడ్పడుతుందని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. బుధవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రవచన మండపంలో బెంగుళూరు చెందిన ఏబీ గణేష్‌దాసులు, జగదీష్, ఎంఎస్‌లు హరికథామృతంలో సుందరకాండ అంశంపై ప్రవచనాలు చేశారు. గురుసార్వభౌమ దాససాహిత్య ప్రాజెక్టు నిర్దేశకులు అప్పన్నాచార్, వాఫీరాజరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

పంట నష్టపరిహారం మంజూరు

మంత్రాలయం, మార్చి 6: మండలంలో 2023 ఖరీఫ్‌లో వర్షాలు లేక కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిందని, నష్టపోయిన రైతులకు రూ.12.03 కోట్లు నష్టపరిహారం మంజూరయ్యిందని వ్యవసాయ సలహామండలి చైర్మన్ సీవీ విశ్వనాథ రెడ్డి, మండల వ్యవసాయాధికారి జీర గణేష్, ఏఈవో నరసింహులు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 9,650 మంది రైతులకు రూ.12.03 కోట్లు నష్టపరిహారం మంజూరైందని తెలిపారు.

మున్సిపల్ కౌన్సిల్ రసాభాస

- పోడియం ముందు బైఠాయించిన టీడీపీ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు, మార్చి 6: ఎమ్మిగనూరు పురపాలక సంఘం సమావేశం రసాభాసగా సాగింది. సమస్యలు లేవనెత్తుతున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్‌ను అడ్డుకోవటంతో ఇరువురి మధ్యా వాగ్వాదం చోటుచేసుకొని రాసాభాసగా మారింది. చైర్మన్ డాక్టర్ రఘు అసహనానికి గురై బెల్ కొట్టి సమావేశాన్ని ముగించారు. దీంతో కౌన్సిల్ సభ్యులు ఇదేమి సమావేశం అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తు వెళ్లి పోయారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన జరిగింది. అజెండాలోని 62వ అంశాన్ని వాయిదా వేసి మిగతా అంశాలన్ని ఆమోదిస్తున్నామని వైస్‌చైర్మన్ నజీర్ అహ్మద్ తెలిపాడు. అనంతరం టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ పట్టణంలో జనరల్ ఫండ్‌కింద అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.4కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వైస్‌చైర్మన్ నజీర్ అహ్మద్ కలుగ జేసుకోవటంతో ఇరువురి మధ్యా వాగ్వాదం చోటు చేసుకొంది. ఇరువురు ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని చైర్మన్ డా. రఘు కోరినప్పటికి పట్టించుకోలేదు.

అప్పు అడిగితే దాడి చేయడం అన్యాయం

తుగ్గలి, మార్చి 6: ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే కులం పేరుతో దూషించి దాడి చేసేందుకు వచ్చిన వారిపై కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ రామకొండ వెంకటేశ్వర్లు, పులికొండ డిమాండ్ చేశారు. మారెళ్లకు చెందిన దళిత కోటమ్మ, నాగన్న ఈడిగ శివయ్యకు రూ.2 లక్షలు అప్పు ఇచ్చారని, ఆ అప్పును తిరిగి ఇవ్వాలని కోరగా కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పత్తికొండ డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రహదారి పనులకు భూమి పూజ

మద్దికెర, మార్చి 6: మండల కేంద్రం నుంచి బురుజుల గ్రామానికి మంజూరైన రహదారి పనులకు ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, జడ్పీటీసీ సభ్యులు డి.మురళిధర్ రెడ్డి భూమి పూజ చేశారు. బుధవారం మద్దికెర గ్రామం నుంచి బురుజుల గ్రామానికి తారోడ్డు రహదారి పనులకు రూ.5.70 కోట్లు మంజూరు కావడంతో ఈ సందర్భంగా భూమి పూజ చేసి ఎక్సవేటర్ ద్వారా పనులు మొదలు పెట్టారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

నేడు పంచాయతీ వేలాలు

వెల్దుర్తి, మార్చి 6 : గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్ పార్కింగ్ ఫీజు, జంతువధశాల, మాంసపు దుకాణలను గురువారం కార్యాలయంలో బహిరంగ వేలం వేస్తున్నట్లు ఈఓ రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పనులు కల్పించకపోతే చర్యలు

తుగ్గలి, మార్చి 6: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించకపోతే.. చర్యలు తప్పవని ఏపీవో రామక్రిష్ణ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలి ఏపీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని దినాలు ఉన్నా ప్రతి ఉపాధి కూలీకి పనులు కల్పించాలని, అలా కాకుండా నిర్లక్ష్యం కల్పిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బ్రతికి వున్న మొక్కలకు మాత్రమే బిల్లులు చెల్లిస్తామన్నారు. సమావేశంలో టీఏలు రాజశేఖర్, రామక్రిష్ణ, ఫరీదప్ప, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

కోసిగి, మార్చి 6: మండల కేంద్రంలోని సిద్దప్పపాలెంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ గర్భగుడిలో శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు ఇల్లూరి శ్రీనివాసులు, ఆదినారాయణ పూజలతో ప్రాంభించారు. కార్యక్రమాన్ని అనంతపురం చెందిన పురోహితులు బాలాజి శర్మ, గరుడాద్రి సురేష్ శర్మ చేతుల మీదుగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించండి : సీపీఐ

కోసిగి, మార్చి 6: రాబోవు లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. బుధవారం కోసిగిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పిన బీజేపీని రాబోవు లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్, గోపాల్, ఓంకార్ స్వామి, తిమ్మయ్య, వీరేష్, తిక్కన్న, రమేష్, తదితరులు ఉన్నారు.

భక్తులకు నిజ బృందావన దర్శనం

మంత్రాలయం, మార్చి 6: రాఘవేంద్రస్వామి మఠంలో బుధవారం ఏకాదశిని పురస్కరించుకొని రాఘవేంద్రస్వామి బృందావనానికి జరిగే నిత్యపూజలు బంద్ చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృంధావనానికి నిర్మల విసర్జనం, తులసిఅర్చనలు మాత్రమే నిర్వహించారు. టెంకాయ కొట్టడం, పరిమళ ప్రసాదం, నిత్యాన్నదానం, రథోత్సవల ఊరేగింపు, ఊంజల సేవలు బంద్ చేశారు.

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

మద్దికెర, మార్చి 6: మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని పంచాయతీ సభ్యులు కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సర్పంచు బండారు సుహాసిని అధ్యక్షతన సమావేశం జరిగింది. టీడీపీ పంచాయతీ సభ్యులు జమేదార్ జంబునాథ్ రాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా ప్రతిపాదించిన చోట సీసీ రోడ్లు వేయలేదని అన్నారు. స్థానిక మద్దమ్మవ్వ జాతర ప్రాంతంలో సీసీ రోడ్లు వేయాలని కోరారు. కొంత మంది పంచాయతీ స్థలాలు ఆక్రమించి అద్దెలకు ఇచ్చుకుంటున్నారని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పంట నష్ట పరిహారం విడుదల

వెల్దుర్తి, మార్చి6 : గత ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, కంది, పత్తి, మిరప, ఉల్లి తదితర పంటలు సాగుచేసి వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన 18096 మంది రైతులకు రూ.15కోట్ల 36లక్షలు పంట నష్టపరిహారం మంజూరైనట్లు వ్యవసాయ అధికారి అక్బర్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

తుగ్గలి, మార్చి 6: రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని మాజీ సర్పంచు బర్మా వీరేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెండేకల్లులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి టీడీపీ అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. రాబోవు ఎన్నికల్లో అరాచక వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఘనంగా అల్లిసాహెబ్ స్వామి జియారత్

గోనెగండ్ల, మార్చి 6: మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో వెలసిన అల్లిసాహెబ్ స్వామి జియారత్ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జీవసమాధిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలి

తుగ్గలి, మార్చి 6: టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు తట్టుకోలేక మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకు వస్తున్న భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు తిరుపాల్‌నాయుడు, వెంకట్రాముడు చౌదరి, రాముా నాయక్, శ్రీనివాసులు గౌడు అన్నారు. గురువారం భువనేశ్వరి మండలానికి వస్తుండటంతో మీటేతాండ, కడమకుంట్ల గ్రామాలను వారు పరిశీలించారు.

రేపటి నుంచి బుగ్గ సంగమేశ్వరాలయంలో పూజలు

మద్దికెర, మార్చి 6: మండల కేంద్రంలోని బుగ్గ సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు 8 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈవో క్రిష్ణయ్య తెలిపారు. బుగ్గ సంగమేశ్వరున్ని దర్శించుకునేందుకు ఈ ప్రాంత ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.